జగమంతా రాగమయం

- సరిగమల సంగతులు.. సప్తస్వరాల సవ్వడులు
- సంగీతంతో మానసిక ప్రశాంతత
- ఉత్సాహాన్ని, ఉత్తేజాన్ని నింపేదే అసలైన సంగీతం
- పెరుగుతున్న సంగీత అభ్యాసకుల సంఖ్య
- నేడు ప్రపంచ సంగీత దినోత్సవం


సంగీత నేర్చుకుంటున్న చిన్నారులు

కర్నూలు కల్చరల్: సంగీతంలో అనంత సాగరమంత సంగతులు మిళితమై ఉన్నాయి. 'శిశుర్వేత్తి పశుర్వేత్తి గాన రసం ఫణిః' అని పండితులు అన్నారు. జోల పాటల సంగీతానికి శిశువులు ప్రశాంతంగా నిద్రలోకి జారుకుంటారు. శ్రావ్యమైన సంగీతానికి పశువులు పరవశిస్తాయి. వినసొంపైన సంగీత ఝరికి సర్పాలు సైతం తలలు ఆడిస్తూ సయ్యాటలాడతాయి. సప్తస్వరాలకు అంత శక్తి ఉంది. సంగీతం మానసిక ప్రశాంతతను చేకూరుస్తుంది. శ్రుతి పరమైన సంగీతానికి వినసొంపైన లయ చేకూరినప్పుడే మనసుకు హాయినిస్తుంది. ఇలా మనసును తేలిక పరుస్తూ ఉత్సాహాన్ని ఉత్తేజాన్ని నింపేదే అసలైన సంగీతం. బుధవారం 'ప్రపంచ సంగీతం దినోత్సవం' సందర్భంగా కథనం.

సంగీతం ఒక అద్భుతం

సృష్టిలో సంగీతం స్థానం అద్వితీయం. చదువుల తల్లి సరస్వతీ దేవికి కూడా ఒక చేతిలో పుస్తకం ఉంటే మరో చేతిలో వీణ అలంకరించింది. సంగీతంలో కావాల్సిన వారికి శక్తి, రక్తి, భక్తి దొరుకుతుంది. విశ్వజనీనంగా మాట్లాడే శక్తి కేవలం సంగీతానికే ఉందనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. సంగీతం మానవుల సర్వసామాన్య భాష. ప్రపంచంలో ఎలాంటి ఎల్లలు లేకుండా స్వైర విహారం చేసేది సంగీతమే. రాతి యుగం నుంచి కంప్యూటర్ యుగం దాకా సంగీతం స్వేచ్ఛగా వీనుల విందుగా వినసొంపుగా మానసిక ప్రశాంతతను ఇస్తూ ఉత్సాహ పరుస్తుందనడంలో ఎలాంటి సందేహం లేదు.

శాస్త్రీయమే మాతృక

ప్రముఖంగా సంగీతం మూడు రకాలు. కర్ణాటకం, హిందూస్థానీ, పాశ్చాత్యం. ఇవే కాకుండా ఇటీవల కాలంలో రకరకాలుగా సంగీతాన్ని విభజించి చూపుతున్నారు. ఎన్ని సంగీతాలు ఉన్నా మాతృక మాత్రం శాస్త్రీయమే. ఈ మూడింటి కలయికతో లలిత సంగీతం, సినిమా సంగీతం, వాద్య సంగీతం ఏర్పడి రకరకాలుగా మనిషిని ప్రేరణకు గురిచేస్తున్నాయి.

ముక్తి.. భుక్తి

పూర్వం సంగీతంతో వాగ్గేయకారులు ముక్తిని పొందితే నేడు మనకది భుక్తిని ప్రసాదిస్తోంది. మన దేశంలో ఎంఎస్ సుబ్బలక్ష్మి, బాలమురళీకృష్ణ, పినాకపాణి, పండిట్ జస్‌రాజ్, బడేగులాం అలీఖాన్, ఘంటసాల, జేసుదాస్, ఎస్పీ బాలు, మను లాంటి ఎంతో మంది మహా విద్వాంసులు వారి బాణీలతో మనసులను తన్మయులను చేశారు.

జిల్లాలో సంగీత శిక్షణా సంస్థలు

ఉమ్మడి కర్నూలు జిల్లాలో ప్రభుత్వ శారదా సంగీత నృత్య కళాశాలతో పాటు కర్నూలు నగరం, నంద్యాల, ఆదోని, డోన్, నందికొట్కూరు, ఆత్మకూరు, ఎమ్మిగనూరు తదితర పట్టణాల్లో సుమారు 350కి పైగా శిక్షణా సంస్థలు ఉన్నాయి. కొందరు ఇళ్లలోనే సంగీతం నేర్పుతున్నారు. మరికొందరు దేశ విదేశాలు, ఇతర రాష్ట్రాల్లో ఉన్నవారికి సైతం ఆన్‌లైన్‌లో శిక్షణ ఇస్తున్నారు. ప్రభుత్వ సంగీత కళాశాలలో 2018–19లో 131, 2019–20లో 106, 2020–21లో 110, 2021–22లో 120, 2022–23లో 146 మంది సంగీతంలో శిక్షణ పొందారు.

సంగీతం నేర్పించాలి



సంగీతం మనసుకు ప్రశాంతతను ఇస్తుంది. ఇది విశ్వజనీనమైంది. లలిత కళల్లో ఒకటైన సంగీతం మానవుని ఆనందం కోసం భగవంతుడు ఇచ్చిన అపురూప, అమూల్యమైన బహుమానాల్లో ఒకటి. వాగ్గేయకారులు సంగీతం గొప్పతనాన్ని కొనియాడి భారతీయ సంగీతం ఆధ్యాత్మిక చింతనను కలిగించారు. సంగీతాభివృద్ధికి కారకులైన పురందర దాసు, రామదాసు, త్యాగరాజు, ముత్తుస్వామి దీక్షితులు, శ్యామశాస్త్రి తదితర వాగ్గేయకారులు సంగీతజ్ఞులే గాక గొప్ప భక్తాగ్రేసరులుగా కీర్తికెక్కారు. సంగీతాన్ని మూడేళ్ల వయసు నుంచే నేర్పించాలి. యాజమాన్యాలతో సంబంధం లేకుండా ప్రతి పాఠశాలలో సంగీత టీచర్‌ను ఏర్పాటు చేసుకుని సంగీతం నేర్పించాలి.

–వి.ధనలక్ష్మి, మ్యూజిక్ టీచర్, దిన్నెదేవరపాడు, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల

ఏకాగ్రత పెరుగుతుంది



సామాన్య ప్రజలకు కూడా సంగీతం చేరువ కావాలనే ఉద్దేశ్యంతో 1982 జూన్ 21న మొట్ట మొదట పారిస్‌లో సంగీత దినోత్సవాన్ని నిర్వహించారు. ప్రముఖ సంగీత కారులతో వీధుల్లో ఉచితంగా సంగీత కచేరీలు నిర్వహించారు. తరువాత అనేక దేశాల్లో ఈ సంప్రదాయాన్ని ఆచరించడం మొదలు పెట్టారు. సంగీతం అంటే శబ్దాన్ని కాలంతో మేళవించి వినసొంపుగా మార్చే ప్రక్రియ. విశ్వమంతా వ్యాపించి ఉన్న ఈ సంగీతం 64 కళల్లో ఒకటి. భారతీయ సంగీతం అనేక సంప్రదాయ రీతుల్లో భాసిల్లుతుంది. సంగీతం మనిషికి మానసిక ఉల్లాసాన్నిస్తుంది. సంగీతం నేర్చుకోవడం వల్ల ఏకాగ్రత పెరుగుతుంది.

– నాగమల్లీశ్వరి, సంగీతం ఉపాధ్యాయురాలు

ఒత్తిడి దూరం అవుతోంది



సంగీతంలో రాగ థెరపీ ద్వారా రోగాలు నయమైనట్లు పలు పరిశోధనల్లో నిరూపితమైంది. మనిషి మానసిక ఒత్తిడి నుంచి దూరమయ్యేందుకు సంగీతం ఎంతగానో ఉపయోగపడుతుంది. మానసిక ప్రశాంతతకు సంగీతం చాలా అవసరం. సంగీత సాధనతో ఏకాగ్రత పెరుగుతుంది. నేటి సినిమా సంగీతంతో పాటు శాస్త్రీయ, కర్ణాక సంగీతానికి అందరూ తోడ్పాటును ఇవ్వాలి. పిల్లలకు సంగీతం నేర్పించాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉంది. పసివయస్సు నుంచే సంగీతం నేర్పించడం వల్ల క్రమశిక్షణ అలవడుతుంది.

– శైలజ, ఆన్‌లైన్ సంగీత శిక్షకులు, కర్నూలు

మనసు ప్రశాంతంగా ఉంటుంది



సంగీతంపై ఇష్టంతో వివాహమై పాప జన్మించాక సంగీతం నేర్చుకుంటున్నాను. క్లాస్‌కు వెళ్లి నేర్చుకునే అవకాశం లేకపోవడంతో ఆన్‌లైన్‌లో శిక్షణ పొందుతున్నాను. ఏకాగ్రత, ఓర్పు పెరిగాయి. దీర్ఘ శ్వాసను కంట్రోల్ చేసుకోగల శక్తి లభించింది. ఇష్టంతో నేర్చుకోవడం ప్రారంభించాక ఇలా ఎన్నో ప్రయోజనాలు కలగడం ఊహించలేదు. మనోరంజక మైన సంగీతంతో మనసు ప్రశాంతంగా ఉంటుంది.

– లక్ష్మీ వినీత, ఆన్‌లైన్ సంగీత అభ్యాసకురాలు

ల్యామినేషన్ మిషన్ ఏర్పాటు


బస్ పాస్‌ను ల్యామినేషన్ చేస్తున్న దృశ్యం

సాక్షి ఎఫెక్ట్

కర్నూలు(రాజ్‌విహార్): రోడ్డు రవాణా సంస్థ బస్ పాస్‌ల కౌంటర్ మంజూరు కౌంటర్‌లో కొత్త ల్యామినేషన్ మిషన్, కలర్ ప్రింటర్ ఏర్పాటు చేశారు. పాసులు జారీ చేస్తున్నా.. కౌంటరులో ల్యామినేషన్ మిషన్, కలర్ ప్రింటర్ లేకపోవడంపై సోమవారం 'సాక్షి'లో 'ఇదో రకం దోపిడీ' శీర్షికన ప్రచురితమైన కథనానికి జిల్లా ప్రజా రవాణ శాఖాధికారి టి. వెంకటరామం స్పందించారు. ల్యామినేషన్ మిషన్‌తో పాటు కలర్ ప్రింటర్‌ను ఏర్పాటు చేయాలని ఆదేశించడంతో సంబంధిత ఏజెన్సీ నిర్వాహకులు మంగళవారం కొత్తవి ఏర్పాటు చేశారు. రూ.50లకే గుర్తింపు కార్డులు తప్పనిసరిగా కలర్ ప్రింట్ తీయడంతో పాటు ల్యామినేషన్ చేసి ఇవ్వాలని ఆయన ఆదేశించారు. సేవల్లో లోపం ఉంటే తమ అధికారులకు ఫిర్యాదు చేయాలని సూచించారు.

చదరంగంలో రాణించాలి


చదరంగం పోటీలను ప్రారంభిస్తున్న శమంతకమణి

కర్నూలు (రూరల్): చదరంగంలో రాణించాలని మార్కెట్ యార్డు మాజీ చైర్‌పర్సన్ నగరూరు శమంతకమణి చిన్నారులకు సూచించారు. ఒలింపిక్ డే సందర్భంగా ఔట్‌డోర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన చదరంగం, క్యారమ్స్ పోటీలను మంగళవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంఆ శమంతకమణి మాట్లాడుతూ చదరంగం ద్వారా మెదడు చురుకుగా పనిచేస్తుందన్నారు. క్రీడల్లో రాణించిన వారికి మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఒలింపిక్ సంఘం నాయకులు సునీల్‌కుమార్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

జవాబుదారీతనంతో పనిచేయండి

కర్నూలు(రాజ్‌విహార్): వినియోగదారులకు సేవలందించడంలో జవాబుదారీతనంతో పనిచేయాలని దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ కర్నూలు రూరల్స్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు వై.సుబ్బన్న సూచించారు. మంగళవారం ఆయన స్థానిక పవర్ హౌస్‌లోని తన కార్యాలయంలో కింది స్థాయి సిబ్బందితో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మా ట్లాడుతూ విధుల పట్ల నిర్లక్ష్యం వహించరాదన్నారు.

ఈ-శ్రామ్ ఉంటే ప్రయోజనాలు

కర్నూలు(రాజ్‌విహార్): అసంఘటిత కార్మికులు ఈ-శ్రామ్ కార్డులు కలిగి ఉంటే ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని కార్మిక శాఖ సహాయాధికారి కేశన్న మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్డులు ఉండడంతో కేంద, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలకు వర్తించడంతో పాటు ఇతర లాభాలున్నాయని, సమీపంలోని సచివాలయాలు, మీ సేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకొని లబ్ధి పొందవచ్చని పేర్కొన్నారు

రేపు జాబ్ మేళా

కర్నూలు సిటీ: ఐటీఐలో ఏ ట్రేడ్‌లోనైనా ఉత్తీర్ణులు అయిన వారందరికీ ఈనెల 22న బి.తాండ్రపాడులోని ప్రభుత్వ ఐటీఐ కాలేజీలో జాబ్ మేళా నిర్వహించనున్నట్లు కాలేజీ ప్రిన్సిపాల్ పి.వి ప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. షిర్డీ సాయి ఎలక్ట్రానిక్స్‌లో పని చేసేందుకు ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, వెల్డర్‌తో పాటు మిగిలిన ట్రేడ్స్ అభ్యర్థులు కూడా మేళాకు హాజరుకావచ్చన్నారు. 18 నుంచి 27 ఏళ్ల వయస్సు కలిగిన వారు మేళలో పాల్గొనవచ్చని, ఎంపికైన వారికి నెలకు రూ.12 వేలు వేతనం ఇస్తారని తెలిపారు.

పెద్దాసుపత్రిలో కుళాయి దొంగ


పట్టుబడిన దొంగ

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని పలు విభాగాల్లో సంచరిస్తూ కుళాయిలను విప్పుకుని దొంగిలిస్తున్న ఓ వ్యక్తిని మంగళవారం ఆసుపత్రి సెక్యూరిటీ గార్డులు పట్టుకున్నారు. వెల్దుర్తికి చెందిన మద్దిలేటి ఆసుపత్రిలో కొంత కాలంగా తిరుగుతూ కుళాయిలు విప్పుకుని వాటిని బయట విక్రయించి సొమ్ము చేసుకునేవాడు. మంగళవారం ఎంసీహెచ్ బ్లాక్‌లో కుళాయిలు విప్పుతుండగా సెక్యూరిటీ గార్డులు పట్టుకుని మూడో పట్టణ పోలీసులకు అప్పగించారు.

నేడు వీహెచ్‌పీ ధర్నా

కర్నూలు కల్చరల్: ఆలయాల భూములను కాపాడుకోవాలనే డిమాండ్‌తో వీహెచ్‌పీ ఆధ్వర్యంలో బుధవారం ఉదయం 10.30 గంటల కు కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించనున్నట్లు వీహెచ్‌పీ నాయకులు మంగళవారం ఒక ప్రక టనలో పేర్కొన్నారు. జొహరాపురం నీలకంఠ స్వామి ఆలయం భూములను కమ్యూనిస్టు పార్టీ వారు కబ్జా చేసి రెండు నెలలు గడుస్తున్నా ఇంత వరకు చర్యలు తీసుకోకపోవడంతో ప్రభుత్వ తీరుకు నిరసనగా ధర్నా చేపట్టనున్నట్లు పేర్కొన్నారు.

ఎస్సీ, ఎస్టీలకు ప్రత్యేక స్పందన నిర్వహించాలి

కర్నూలు(అర్బన్): జిల్లాలో ఎస్సీ, ఎస్టీల సమస్యల పరిష్కారానికి ప్రతి నెలా మొదటి వారంలో ప్రత్యేక స్పందన కార్యక్రమం నిర్వహించాలని జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు వై.రాజు, రవిశాస్త్రి, సాయిప్రదీప్, నవీన్, రమేష్‌బాబు, శామ్యూల్ ప్రభుదాస్, శాంతకుమార్ తదితరులు కోరా రు. జిల్లా ఎస్సీ సంక్షేమం, సాధికారత అధికారిణిగా తూర్పు గోదావరి జిల్లా నుంచి బదిలీపై వచ్చి బాధ్యతలు స్వీకరించిన జె.రంగలక్ష్మీదేవిని వారు కలిసి పూలబొకే అందజేశారు.

జాబ్ మేళాకు విశేష స్పందన

కర్నూలు సిటీ: కేవీఆర్ మహిళా డిగ్రీ కాలేజీలో జవహర్‌లాల్ నెహ్రూ నాలెడ్జ్ సెంటర్ ఆధ్వర్యంలో రెండు రోజులుగా నిర్వహించిన జాబ్ మేళాకు విశేష స్పందన లభించిందని కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఇందిరాశాంతి తెలిపారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ 350 మంది యువతీయవకులు హాజరుకాగా 126 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారన్నారు. జేకేసీ కో-ఆర్డినేటర్ డాక్టర్ బి.ధనశ్రీ, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ జి.మహబూబ్ బాషా, లలితా జ్యువెలర్స్ హెచ్‌ఆర్ ఫజిలుద్దీన్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శుల నియామకం

కర్నూలు(రూరల్): కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శులుగా గార్గేయపురానికి చెందిన రియాజుద్దీన్, అశోక్‌నగర్‌కు చెందిన ఎజాజ్ అహమ్మద్‌లను నియమించినట్లు డీసీసీ అధ్యక్షుడు సుధాకర్ బాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

24లోపు రిజిస్ట్రేషన్ చేసుకోండి

కర్నూలు సిటీ: కేవీఆర్ మహిళా డిగ్రీ కాలేజీలో ప్రవేశాల కోసం ఈనెల 24వ తేదీలోపు www.sche.ap.govలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ప్రిన్సిపాల్ డాక్టర్ ఇందిరాశాంతి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బీఏ, బీఎస్సీ, బీకాం ఆనర్స్ కోర్సులు నూతన విద్యా విధానం ప్రకారం అన్ని సబ్జెక్టులలో సింగిల్ మేజర్ కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు. రిజిస్ట్రేషన్‌పై అనుమానాలు ఉంటే 7997787103 నంబరును సంప్రదించాలన్నారు. కాలేజీలోనే ఉచితంగా రిజిస్ట్రేషన్ సౌకర్యాన్ని కల్పించినట్లు ఆమె పేర్కొన్నారు.

ఎఫ్‌ఆర్‌ఎస్ ద్వారానే హాజరు వేయాలి


రికార్డులు తనిఖీ చేస్తున్న డీఎంహెచ్ఓ డాక్టర్ బి.రామగిడ్డయ్య

కర్నూలు(హాస్పిటల్): వైద్యాధికారులు, వైద్య సిబ్బంది ఫేస్ రికగ్నేషన్ సిస్టమ్ యాప్(ఎఫ్ఆర్ఎస్) ద్వారానే హాజరు వేయాలని డీఎంహెచ్‌వో డాక్టర్ బి.రామగిడ్డయ్య ఆదేశించారు. మంగళవారం ఆయన నగరంలోని ఇల్లూరు నగర్, స్టాంటన్ పురం యూపీహెచ్‌సీలను తనిఖీ చేశారు. ఏఎన్ఎం యాప్, రికార్డులు, రిపోర్టులు పరిశీలించి తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ఎన్‌సీడీ సర్వేలో భాగంగా ప్రతి ఏఎన్ఎం రోజుకు పది హెల్త్ ఐడీలు జనరేట్ చేయాలని చెప్పారు. ఆరోగ్యసేవల కోసం వచ్చిన వారిని మొదట డేటా ఎంట్రీ ఆపరేటర్ దగ్గర ఎలక్ట్రానిక్ హెల్త్ రికార్డులో వారి ఆయుష్ భారత్ హెల్త్ అకౌంట్(అబా) ద్వారా నమోదు చేసుకున్న తర్వాత డాక్టర్ వద్దకు స్టాఫ్‌నర్సు పంపించాలన్నారు. అనంతరం ల్యాబ్, ఫార్మాసిలకు పంపి వారి ఆరోగ్యపరీక్షలు, ఆరోగ్యసేవలు, చికిత్సలు అందించి ఆ వివరాలను ఈహెచ్‌ఆర్‌లో అప్‌లోడ్ చేయాలని చెప్పారు. ప్రతి బుధవారం, శనివారం గర్భవతులు, 16 సంవత్సరాలలోపు పిల్లలకు ఇవ్వాల్సిన టీకాలు క్రమం తప్పకుండా ఇవ్వాలని ఆ వివరాలను ఎంసీపీ కార్డులో నమోదు చేసి, ఎప్పటికప్పుడు ఆర్‌సీహెచ్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని తెలిపారు. గర్భిణి, కిశోర బాలికలకు హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించాలని, ఆ వివరాలను అనీమియా మానటరింగ్ టూల్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. అందులో రక్తహీనత ఉన్న వారికి తగిన చికిత్సలు ఇవ్వాలన్నారు. గర్భిణికి ప్రమాదకర చిహ్నాలు ఉంటే వారిని సంబంధిత ప్రభుత్వ ఆసుపత్రిలో కాన్పు తేదికి మూడు రోజులు ముందుగానే రెఫర్ చేసి ఆ వివరాలను సంబంధిత యాప్‌లో నమోదు చేయాలని తెలిపారు.

ఆరోగ్యశ్రీలో డబ్బు వసూలు చేస్తే చర్యలు


మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన

కర్నూలు(హాస్పిటల్): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆరోగ్యశ్రీ పథకం కింద వైద్యం అందుకుంటున్న నిరుపేదలతో డబ్బు వసూలు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన హెచ్చరించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో డిస్ట్రిక్ట్ డిసిప్లినరీ కమిటీతో ఆరోగ్యశ్రీ అంశంపై ప్రైవేటు నెట్‌వర్క్ ఆసుపత్రులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ వైద్యం పొందిన వారి నుంచి వచ్చిన ఫిర్యాదుల మేరకు ప్రైవేటు నెట్‌వర్క్ ఆసుపత్రులతో, డిస్ట్రిక్ట్ డిసిప్లినరీ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించి విచారించామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఏ ఉద్దేశంతో ఆరోగ్యశ్రీ మొదలుపెట్టిందో అందుకు సంబంధించిన నాణ్యమైన వైద్యసేవలు పూర్తిస్థాయిలో ప్రజలకు అందించాలన్నారు. పది ఆసుపత్రుల నుంచి ఆరోగ్యశ్రీ పథకం అమలు చేస్తూ వైద్యం చేయించుకుంటున్న 19 మంది బాధితుల నుంచి రూ.1,14,500 వసూలు చేసినట్లు ఫిర్యాదులు అందాయన్న అంశంపై సంబంధిత ఆసుపత్రి వారిని ఆరా తీయగా వారి నుంచి వచ్చిన సమాధానం సరిగా లేనందున ఫిర్యాదులు అందిన 10 ఆసుపత్రులకు రూ.5,72,500 పెనాల్టీ వేసినట్లు తెలిపారు. సమావేశంలో డీఎంహెచ్ఓ డాక్టర్ బి.రామగిడ్డయ్య, డీసీహెచ్ఎస్ డాక్టర్ శ్రీనివాసరావు, ఆరోగ్యశ్రీ జిల్లా కో ఆర్డినేటర్ డాక్టర్ రఘు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య మిత్ర సేవలు అభినందనీయం

ఆరోగ్యశ్రీ లబ్ధిదారులకు ఉత్తమ సేవలు అందించిన ఆరోగ్య మిత్రల సేవలు అభినందనీయమని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన అన్నారు. మంగళవారం జిల్లా కలెక్టర్ తన చాంబర్‌లో ఆరోగ్యమిత్రలకు ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న డాక్టర్ వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ అమలులో భాగంగా సేవా ఆరోగ్యమిత్రలు ఎంతో కీలక పాత్ర పోషిస్తూ ఉత్తమ సేవలు అందజేస్తున్నారన్నారు. అందుకు కృషి చేసిన సేవా ఆరోగ్యమిత్రలకు ప్రతి నెలా ఇద్దరినీ ఎంపిక చేసి ప్రశంసా పత్రంతో పాటు నగదు పురస్కారం ఇస్తున్నట్లు చెప్పారు. ఇందులో భాగంగా ఏప్రిల్ మాసానికి అమీలియో ఆసుపత్రి సేవా ఆరోగ్య మిత్ర డి.శాంతకుమారి, మే మాసానికి గౌరిగోపాల్ హాస్పిటల్ సేవా ఆరోగ్య మిత్ర జి.శరణ్యలను ప్రశంసా పత్రంతో పాటు రూ.5 వేల చొప్పున నగదు పురస్కారాన్ని అందజేసినట్లు చెప్పారు.

క్రీడా డిప్లొమా కోర్సుకు ప్రవేశ పరీక్ష

కర్నూలు (రూరల్): గ్వాలియర్‌లోని లక్ష్మీబాయి నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ యూనివర్సిటీ అందిస్తున్న పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ స్పోర్ట్స్ కోచింగ్ (పీజీడీఎస్సీ), డిప్లొమా ఇన్ స్పోర్ట్స్ కోచింగ్ (డీఎస్సీ) కోర్సులకు 2023–24 విద్యాసంవత్సరానికి ప్రవేశ పరీక్ష జూన్-జులై మాసంలో నిర్వహిస్తున్నట్లు జిల్లా క్రీడాశాఖ సీఈఓ రమణ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు.

24న జిల్లాస్థాయి ఆట్యా-పాట్యా పోటీలు

కర్నూలు(రూరల్): ఈనెల 24న బి.క్యాంప్ బాయ్స్ స్కూల్ క్రీడామైదానంలో ఆట్యా-పాట్యా అండర్-16 పోటీలు నిర్వహించనున్నట్లు ఆట్యా-పాట్యా అసోసియేషన్ జిల్లా కార్యదర్శి నాగరత్నమయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన వారిని వచ్చేనెల 1న తునిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు పంపుతామన్నారు. ఆసక్తి ఉన్న వారు ఆధార్ కార్డు, రెండు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలతో హాజరుకావాలన్నారు.మరిన్ని వివరాలకు 9393855460 నంబర్‌ను సంప్రదించాలన్నారు

కారుణ్య అభ్యర్థుల వివరాలు ఇవ్వండి

కర్నూలు(రాజ్‌విహార్): ప్రజా రవాణా శాఖలో కారుణ్య నియామకాల కోసం దరఖాస్తులు చేసుకున్న అభ్యర్థుల వివరాలను జిల్లా కలెక్టర్‌కు సమర్పించాలని రోడ్డు రవాణా సంస్థ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ద్వారకా తిరుమలరావు ఆదేశించారు. 2016 నుంచి ఉన్న పెండింగ్ దరఖాస్తుల్లో మూడు విడుతలుగా వివిధ విభాగాల్లో ఉద్యోగాలు భర్తీ చేయగా మిగిలిన దరఖాస్తులు, వారి విద్యార్హతల పూర్తి వివరాలు సమర్పించాలన్నారు. కర్నూలు జిల్లాలో 28, నంద్యాల జిల్లాలో 76 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నట్లు అధికారులు పేర్కొన్నారు. దీంతో జిల్లాధికారులు ఆ దిశగా చర్యలు చేపట్టారు.

ఆలయ భూముల్లో నిర్మాణాలు చేపడితే చర్యలు

కర్నూలు కల్చరల్: ఆలయాల ఆస్తులను ఆక్రమించినా, నిర్మాణాలు చేపట్టినా కఠిన చర్యలు తీసుకుంటామని దేవదాయశాఖ సహాయ కమిషనర్ రామాంజనేయులు అన్నారు. నేషనల్ హైవే పక్కన లక్ష్మీపురం గ్రామం జగన్నాథస్వామి ఆలయ భూమిలో అక్రమ నిర్మాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వే నంబర్ 60లో 6.23 ఎకరాలు ఖాళీ స్థలంలో ఆ గ్రామ నివాసి కేశవరావు అను వ్యక్తి సర్వే నెం.60 నంబరు గల భూమిని 60/3 నెంబరుగా పొందుపరచి అక్రమంగా కల్లూరు సబ్ రిజిస్టర్‌లో డాక్యుమెంట్ నెం.10213/2022 ద్వారా తన పేరున రిజిస్ట్రేషన్ చేసుకున్నారన్నారు. నిర్మాణాలను నిలిపేయాలని, అక్రమ రిజిస్ట్రేషన్‌ను రద్దు చేయాలని జిల్లా రిజిస్ట్రేషన్ అధికారికి నివేదిక పంపామన్నారు. ఏసీ వెంట దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ కె.శ్రీనివాసరెడ్డి ఇతర అధికారులు ఉన్నారు.

వైభవంగా జగన్నాథ రథయాత్ర

కర్నూలు కల్చరల్: కర్నూలు ఇస్కాన్ ఆధ్వర్యంలో మంగళవారం జగన్నాథ రథయాత్ర వైభవంగా జరిగింది. నగరంలోని పుర వీధుల్లో హరినామ సంకీర్తన చేసుకుంటూ రథయాత్ర నిర్వహించారు. మహా హారతి, ఆశీర్వాదం, మహా ప్రసాద వితరణ, కోలాటం కార్యక్రమాలు జరిగాయి. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఇస్కాన్ కర్నూలు బాధ్యులు వైష్ణోకృప చైతన్య ప్రభు, సభ్యులు పాల్గొన్నారు.

ఐసా జాతీయ మహాసభలను జయప్రదం చేయండి


వాల్‌పోస్టర్లు విడుదల చేస్తున్న ఐసా నాయకులు

కర్నూలు సిటీ: ఆగస్టు 9, 10, 11 తేదీలలో పశ్చిమ బెంగాల్ రాష్ట్ర రాజధాని కలకత్తాలో జరగనున్న ఆల్ ఇండియా స్టూడెంట్ అసోసియేషన్(ఐసా)జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని ఐసా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగరాజు కోరారు. మంగళవారం స్థానిక బిర్లా కాంపౌండ్‌లోని ఐసా కార్యాలయంలో జాతీయ మహాసభల వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో సంఘం నాయకులు నాగార్జున, అనిల్‌కుమార్, రంగస్వామి, నగర నాయకులు పెద్దయ్య, నాని, సాయికుమార్, రాజు తదితరులు పాల్గొన్నారు.


భక్తిశ్రద్ధలతో బోనాలు


బోనాలతో శోభాయాత్ర నిర్వహిస్తున్న మహిళా భక్తులు

కర్నూలు కల్చరల్: నగరంలోని పలు ప్రాంతాల్లోని అమ్మవారి ఆలయాల్లో ఆషాఢ మాసం మంగళవారిన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయిబాబా సంజీవయ్య నగర్ సుంకులమ్మ ఆలయం, బుధవారపేట కాళికాంబ ఆలయంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి దర్శనం కల్పించారు. మహిళలు బోనాలతో నగరంలో శోభాయాత్ర నిర్వహించారు. లలితా పీఠం పీఠాధిపతి మేడా సుబ్రహ్మణ్యం స్వామి, బీజేపీ నాయకులు హరీష్‌బాబు, వీహెచ్‌పీ నాయకులు గోవిందరాజులు, బొల్లెద్దుల రామకృష్ణ, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

– కర్నూలు ఓల్డ్‌సిటీ లలితా పీఠంలో వారాహీ నవరాత్రులు పూజల్లో భాగంగా రెండో రోజు మంగళవారం అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు.

దుకాణాల తనిఖీ


పాత బస్టాండ్‌లోని దుకాణంలో తనిఖీ చేస్తున్న ఇన్‌స్పెక్టర్ పరమేశ్వర్‌కుమార్

కర్నూలు (న్యూసిటీ): నగరంలోని ఎస్వీ కాంప్లెక్స్, పాత బస్టాండ్ వద్ద ఉన్న హార్డ్‌వేర్, కిచెన్‌వేర్, మొబైల్ దుకాణాలను తూనికలు, కొలతల శాఖ ఇన్‌స్పెక్టర్ ఎం.పరమేశ్వరకుమార్, టెక్నికల్ శ్రీనివాసులు మంగళవారం తనిఖీ చేశారు. తూకాల్లో మోసాలకు పాల్పడితే కఠినచర్యలు తీసుకుంటామ ని దుకాణాదారులను హెచ్చరించారు. కాటాలకు ముద్రలు, వస్తువుల ప్యాకేజీలపై ముగింపు తేదీ లేనందున 5 కేసులు నమోదు చేసి, రూ.18 వేలు జరిమానా విధించామని ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

వ్యక్తి అదృశ్యం


నాగేంద్ర బాబు(ఫైల్)

కర్నూలు: స్థానిక బుధవారపేటకు చెందిన నాగేంద్రబాబు (31) అదృశ్యమైనట్లు మంగళవారం పోలీసులు కేసు నమోదు చేశారు. నాగేంద్రబాబు ప్రైవేటు కంపెనీలో ఇంజినీర్‌గా పనిచేస్తున్నాడు. ఈనెల 16న రాత్రి ఇంట్లో నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు బంధువులు, స్నేహితుల ఇళ్ల వద్ద ఆరా తీసినా ఆచూకీ లభించకపోవడంతో పోలీసులను ఆశ్రయించారు. తండ్రి జంబులయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు మూడో పట్టణ సీఐ మురళీధర్‌రెడ్డి తెలిపారు.

క్యాంటీన్ నిర్వాహకుడి మృతి

కర్నూలు: స్థానిక బళ్లారి చౌరస్తా ఫ్లై ఓవర్ బ్రిడ్జిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో మొబైల్ క్యాంటీన్ నిర్వాహకుడు రమేష్ (48) మృతిచెందాడు. కల్లూరులో క్యాంటీన్‌కు అవసరమైన సరుకులను కొనుగోలు చేసి సంతోష్‌నగర్‌లో ఉన్న ఇంటికి ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా కల్లూరు వక్కెరవాగు వైపు నుంచి ఫ్లై ఓవర్ బ్రిడ్జి ఎక్కుతుండగా డోన్ వైపు నుంచి కర్నూలులోకి వస్తున్న కారు ఢీకొంది. దీంతో రమేష్ వాహనం పై నుంచి కింద పడి అక్కడికక్కడే మృతిచెందాడు. ఈయనకు భార్య లక్ష్మితో పాటు ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

నేడు పలు ప్రాంతాల్లో విద్యుత్ కోతలు

కర్నూలు(రాజ్‌విహార్): నగరంలోని నందికొట్కూరు రోడ్డులో 33 కేవీ వార్తా ఫీడర్ పరిధిలో బుధవారం విద్యుత్ కోతలు విధించనున్నట్లు కర్నూలు టౌన్ ఆపరేషన్స్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు రమేష్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మరమ్మతుల పనుల్లో భాగంగా కమలా నగర్, టెలికాం నగర్, గఫూర్ నగర్, ప్రశాంతి నగర్, ఫుడ్ కార్పొరేషన్ ఏరియా, కిసాన్ నగర్, శ్రీనగర్ కాలనీ, లెక్చరర్స్ కాలనీ, మాధవ నగర్ పరిసర ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు.

వార్డెన్‌పై చర్యలు తీసుకోండి

కర్నూలు(అర్బన్): విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తున్న ఎస్సీ కళాశాల బాలుర వసతి గృహం సంక్షేమాధికారిని సస్పెండ్ చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు సోమన్న, నగర కార్యదర్శి మునిస్వామి కోరారు. మంగళవారం సాయంత్రం స్థానిక బళ్లారి చౌరస్తాలో విద్యార్థులు రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భోజనంలో మెనూ పాటించకపోవడంతోపాటు, విద్యార్థులతో పనులు చేయిస్తున్నారన్నారు. ప్రశ్నించే విద్యార్థులపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతూ బెదిరింపులకు గురి చేస్తున్నారన్నారు. వార్డెన్‌పై చర్యలు తీసుకోకుంటే డీడీ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నగర సహాయ కార్యదర్శి ఎస్.విజయ్‌కుమార్, నాయకులు మధు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ రక్తదానం చేయాలి

కర్నూలు(రూరల్): ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.ఎ. గఫూర్ కోరారు. సీఐటీయూ వ్యవస్థాపకులు కామ్రేడ్ పర్సా సత్యనారాయణ శతజయంతి సందర్భంగా మంగళవారం కేకే భవనంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరానికి రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ కేజీ గోవిందరెడ్డితో కలిసి గఫూర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఐటీయూ నాయకులు పోరాటాలకు పరిమితం కాకుండా సేవా కార్యక్రమాలుచేయాలన్నారు.కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు అంజిబాబు, రామాంజనేయులు, సాయిబాబా, గోపాల్, ప్రభాకర్ పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల వితరణ


వృద్ధాశ్రమానికి సరుకులు అందజేస్తున్న దృశ్యం

కర్నూలు(అగ్రికల్చర్): ఎస్‌బీఐ స్టాఫ్ యూనియన్ హైదరాబాద్ సర్కిల్ జనరల్ సెక్రటరీ తారకనాథ్ వర్ధంతిని పురస్కరించుకుని ఎంఎస్‌ఆర్ నగర్ శాఖ సిబ్బంది మంగళవారం సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఎస్‌బీఐ స్టాఫ్ యూనియన్ అమరావతి సర్కిల్ డిప్యూటీ జనరల్ సెక్రటరీ విద్యాసాగర్ ఆధ్వర్యంలో మద్దూరు నగర్‌లోని అమ్మ వృద్ధాశ్రమం, బుధవారపేటలోని పరేడ్ అనాథ చిన్న పిల్లల ఆశ్రమానికి రూ.15 వేల విలువ చేసే బియ్యం, కందిపప్పు, వంటనూనె తదితర నిత్యావసరాలు, నిరుపేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు.